# ఊరంటుకుంది

ఆంధ్రదేశమంతటా ఎండలతో మండిపోతున్న రోజుల్లో—

ఒక ఊరిలో, ఒక పేటలో ఇళ్ళంటుకున్నాయి.

"నిప్పు! నిప్పు!!"

"మంటలు! అయ్యయ్యో మంటలు!!"

"ఫైరింజనుకు ఫోను చెయ్యండి!"

"ఊ- ఆ కర్ర తీసుకుని కొట్టు మంటమీద"

"అయ్యయ్యో, పక్కిల్లుకూడ అంటుకుంటోంది"

—ఇవన్నీ కేకలు, అరుపులు. రకరకాల మనుషులు చేసే ఆర్త నాదాలు. గొంతులు వేరైనా అవి పలికేది ఒక్కటే.

ఆ పేటలోవి మేడలుకావు. మిద్దెలుకావు. సామాన్యులు నివసించే మంటచూరు పెంకుటిళ్ళుకావు. పాకలు, గుడిసెలు, పూరిపాకలు.

సమాజంలో జరుగుతున్న అన్యాయానికి ఎంత కాలంనుంచో మండుతున్నవారి గుండెల్లాగే ఆ గుడిసెలు మండుతున్నాయి. వాటినెలా ఆర్పడమనేదే అక్కడున్న అందరి ఆవేదనా.

ప్రతి ఇంటిలోనూ దాచుకున్న కుండలు, బిందెలు, చెంబులలో వున్ననీళ్ళు తీసుకొచ్చి ఆ మంటలమీద పోస్తున్నారు. ఆ నీళ్ళు నిప్పునేమీ చేయలేకపోతున్నాయి. నీళ్ళను సైతం నిప్పు కాల్చేస్తోంది.

పక్కనున్న ఇల్లు అంటుకోగానే గోవిందయ్య ఇల్లు ఖాళీచేసి దూరంగా నించుని మంటనెలా ఆర్పాలో హడావిడి పడుతూంటే, అతని కూతురు పెళ్ళికోసం నానా ఇబ్బందులు ఎదుర్కొని కొన్న ఇత్తడిబిందె ఎవరో పట్టుకుపోయారని గోవిందయ్య పెళ్ళాం గోల పెడుతోంది.

ఒకరిద్దరు ముసలమ్మలు ఆఊరినే దహించివేస్తున్న నిప్పును సైతం దేవునిగా భావించి, 'అగ్ని దేవుడికి కోపంవచ్చింద'నుకుంటూ ఎలాగోలాగా ఇంత పెరుగన్నం తెచ్చి మంటల్లో పడేస్తున్నారు.

దొంగ పారిపోయాక వచ్చిన పోలీసుల్లాగ, ఆ పేట సగానికి పైగా కాలిపోయింతర్వాత ఫైరింజనులొచ్చాయి. అలవాటుగా జనం వాటిని తిట్టారు.

"మమ్మల్ని తిట్టి ప్రయోజనమేమిటి? కొత్తపేటలో ఇంతకన్నా ఘోరమైన అగ్ని ప్రమాదం జరిగితే అక్కడికెళ్ళాం. రిజర్వ్‌లో వున్న నీరంతా అక్కడే అయిపోయింది. నీళ్ళెక్కడున్నాయో చూపించండి?" అంటూ తిక్కలుచూశారు ప్రభుత్వ అగ్నిమాపక దళంవారు.

జనం దిక్కమొహం వేయటం చూసి గట్టిగా నవ్వుతోంది గాలి. గాలి నవ్వుచూసి మరింతగా మండుతోంది నిప్పు.

గాలి నవ్వుతోంది. నిప్పు మండుతోంది.

ఆ చుట్టుపక్కలెక్కడా నీళ్ళులేవు. కాదు, నీళ్ళున్నాయి, అక్కడున్న అందరి కళ్ళల్లోనూ.

నిర్మలంగా వున్న నీటిలో రాయివేస్తే నీరంతా కదులుతుంది. ఊరిలో ఒక్క ఇల్లంటుకుంటే చాలు, ఆ ఊరు ఊరంతా అంటుకుంటుంది ఏదో ఒక రూపంగా.

అందుకనే—

అదే సమయంలో —

పక్కవీధిలోని పెద్దమనుషులు పెంచలరెడ్డి ఆధ్వర్యాన "అగ్ని బాధితుల సహాయ సంఘం" నెలకొల్పారు.

పెంచలరెడ్డి అన్ని పార్టీలకు చెందికూడా, ఏ పార్టీకీ చెందని యమ్మెల్యే. అందుకనే అన్నికులాలకూ మతాలకూ తగిన ప్రాతినిధ్యం 'అగ్ని బాధితుల సహాయ సంఘం'లో కల్పించిననాడే కులమత ప్రమేయం లేని అగ్ని బాధితుల సహాయ సంఘం ఏర్పడుతుందని విశ్వసించాడు.

ఫలితమే—

విశ్వనాథ శాస్త్రి, రామయ్య చౌదరి, పెదకాపు, రామరాజు, జాన్సన్, నజీరుద్దీన్, పెంటయ్య, శేర్ శంకర్‌లాల్ అగ్ని బాధితుల సహాయ సంఘానికి ముఖ్య సభ్యులయ్యారు.

ఇది జరిగిన ఆరు నెలలకు—

అగ్ని బాధితుల సహాయ సంఘం ముఖ్య సభ్యులూ, పెంచలరెడ్డీ కలసి తమతమ జేబుల్లో సరిపడక బ్యాంకుల్లో దాచుకున్న డబ్బు-ఇరవై వేలు.